జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

మంగళవారం
27-10-2026

సంపుటి 1 | సంచిక 334

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195

విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ | ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ | క్రైమ్ రిపోర్టర్లు

7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)

తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపుపై సానుకూల స్పందన

రేవంత్-ఫడ్నవీస్ భేటీ.. అధ్యయనానికి అధికారుల కమిటీ

దశ, ముంబై: ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. ముంబైలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, భూసేకరణ, పరిహారంపై అధ్యయనం చేసేందుకు ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. ముంపునకు గురయ్యే మహారాష్ట్ర భూములకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. అయితే బ్యారేజీ ఎత్తుపై తుది నిర్ణయం అధికారుల అధ్యయనం, తదుపరి చర్చల అనంతరమే వెలువడనుంది.





రాష్ట్రంలో భారీ వర్ష సూచన

మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్!

దశ, హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ వ్యవస్థ ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అక్టోబర్ 28న ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు సమాచారం. జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సూర్యాపేట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించినట్లు నివేదికలు తెలిపాయి. తుపాను ప్రభావంతో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీర ప్రాంతాల్లో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరికలు వెలువడ్డాయి.



నీటి ఎద్దడి.. బాసర ట్రిపుల్ ఐటీలో ఆన్‌లైన్ క్లాసులు

దశ, ఆదిలాబాద్: బాసర ట్రిపుల్ ఐటీలో నీటి ఎద్దడి తీవ్రం కావడంతో యాజమాన్యం దసరా సెలవులను పొడిగించింది. గోదావరి నుంచి నీటిని తోడే పంప్‌హౌస్ మోటార్లు మొరాయించడంతో క్యాంపస్‌లో తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో విద్యార్థులు ఇళ్ల వద్దే ఉండాలని సూచిస్తూ, సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించాలని నిర్ణయించింది. పీయూసీ విద్యార్థులు నవంబర్ 10లోగా, ఇంజినీరింగ్

..మిగతా 4వ పేజీలో ➔



హైదరాబాద్‌లో పెరుగుతున్న చలి..

14.8 డిగ్రీలకు కనిష్ఠ ఉష్ణోగ్రత!

రాత్రివేళ చల్లని గాలులు.. అక్టోబర్ 28, 29 తేదీల్లో వర్ష సూచన

దశ, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో వాతావరణం క్రమంగా మారుతోంది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఒక మోస్తరుగా ఉంటుండగా, రాత్రివేళల్లో చల్లదనం పెరుగుతోంది. నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 14.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్లు అక్టోబర్ 26న వెలువడిన నివేదికలు వెల్లడించాయి. అక్టోబర్ చివరి వారంలో ఉష్ణోగ్రతల్లో మార్పులు

..మిగతా 4వ పేజీలో ➔

మహాలక్ష్మి పథకంతో

10వేల కోట్లకు పైగా ఆదా

రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలకు ప్రయోజనం

దశ, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 290 కోట్లకు పైగా ప్రయాణాలు చేసినట్లు టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. ఈ పథకం ద్వారా మహిళలు రూ.10 వేల కోట్లకు పైగా ఆదా చేసుకున్నట్లు తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు.

పథకం ప్రారంభానికి ముందు టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా సుమారు 40 శాతంగా ఉండగా, ప్రస్తుతం అది 67 శాతానికి పైగా పెరిగినట్లు సంస్థ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మొత్తం బస్సుల ఆక్యుపెన్సీ రేటు కూడా 69 శాతం నుంచి 98 శాతానికి చేరినట్లు సమాచారం. మహిళలు విద్య, ఉద్యోగాలు, వైద్య సేవలు, వ్యాపారాలు, ఇతర అవసరాల కోసం బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం పొందుతున్నారు. రోజువారీ రవాణా ఖర్చులు తగ్గడంతో కుటుంబాలపై ఆర్థిక భారం కొంత మేర తగ్గుతోందని ప్రభుత్వం పేర్కొంటోంది. ఈ పథకంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పందిస్తూ, మహాలక్ష్మి పథకం కేవలం ఉచిత ప్రయాణ సౌకర్యం మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవం, స్వేచ్ఛ, స్వావలంబనకు ప్రతీక అని పేర్కొన్నారు. మహిళలు తమ అవసరాల కోసం స్వతంత్రంగా ప్రయాణించేందుకు ఈ పథకం దోహదపడుతోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఈ పథకాన్ని ప్రారంభించినట్లు ప్రభుత్వం

..మిగతా 4వ పేజీలో ➔



ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఫడ్నవీస్‌కు ఆహ్వానం

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో సదస్సు

4లో

నీళ్లు లేక.. కరెంట్ రాక..

సూర్యాపేట జిల్లాలో పంటను కాలబెట్టిన కౌలు రైతు




దశ, సూర్యాపేట: తెలంగాణలో సాగు దుర్భరంగా మారింది. అన్నదాతలు అప్పులు చేసి సాగు చేస్తే సరిపడా నీళ్లు, కరెంట్ అందక పంటలు చేతికొచ్చే సమయంలో ఎండిపోతుండటంతో కలత చెందిన రైతన్నలు కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలకు నిప్పు పెట్టడం రాష్ట్రంలో రైతుల పరిస్థితికి అద్దం పడుతున్నది. తాజాగా సూర్యాపేట జిల్లాలో మరో రైతు పంటకు నిప్పు పెట్టాడు. కౌలుకు తీసుకున్న నాలుగెకరాలలో మూడెకరాలు ఎండిపోవడంతో తీవ్ర ఆవేదన చెందిన రైతు పంటకు నిప్పు పెట్టాడు. వివరాల్లోకి వెళ్తే..సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలో యాతాకుల మల్లయ్య అనే రైతు తాను కౌలుకు చేస్తున్న నాలుగెకరాల పంట చేతికి వచ్చే సమయంలో కరెంట్, నీళ్లు సరిగా అందక మూడెకరాల పంట ఎండిపోయింది. దీంతో

..మిగతా 4వ పేజీలో ➔

స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్ల జోరు..

సెన్సెక్స్ 482 పాయింట్లు జంప్



దశ, ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ఒడుదొడుకుల మధ్య లాభాలతో ముగిశాయి. ఉదయం ట్రేడింగ్‌లో కొంత బలహీనత కనిపించినా, చివర్లో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు పుంజుకున్నాయి. ముఖ్యంగా మెటల్, ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో మార్కెట్లకు బలం చేకూరింది. బీఎస్ఈ సెన్సెక్స్ 482 పాయింట్లు (0.66 శాతం) పెరిగి 73,606.75 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 153.20 (0.68 శాతం) లాభంతో 22,753.20 వద్ద ముగిసింది.మెటల్ షేర్లు మార్కెట్ ర్యాలీకి ప్రధానంగా దోహదపడ్డాయి. నిఫ్టీ మెటల్ సూచీ 2.2 శాతం ఎగబాకింది. ఫార్మా షేర్లలోనూ కొనుగోళ్లు వెల్లువెత్తడంతో నిఫ్టీ ఫార్మా సూచీ 1.67 శాతం పెరిగింది. హెల్త్‌కేర్ షేర్లు కూడా లాభాలు నమోదు చేశాయి. మరోవైపు మీడియా, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి.విస్తృత మార్కెట్లలోనూ సానుకూల ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.19 శాతం పెరగగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్

..మిగతా 4వ పేజీలో ➔

వడ్లకు రికార్డు ధర.. క్వింటాల్ రూ.5,016!

దశ, హైదరాబాద్ : తెలంగాణలో వరి ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో రికార్డు స్థాయి ధర లభిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో 'జై శ్రీరామ్' రకం వడ్లు క్వింటాల్‌కు రూ.5,016 పలికినట్లు సమాచారం. నల్గొండ, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లోనూ సన్న రకం ధాన్యానికి రూ.3,000 నుంచి రూ.3,500 వరకు ధర లభిస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఆర్ఎన్ఆర్ వంటి ఇతర సన్న రకాలకు సైతం క్వింటాల్‌కు రూ.4,300 వరకు ధర పలుకుతున్నట్లు తెలుస్తోంది. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వ్యాపారులు, రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలుపై ఆసక్తి చూపుతుండటంతో

..మిగతా 4వ పేజీలో ➔



నీరు వృథా చేస్తే రూ.5 వేల జరిమానా

ట్యాంకర్ల లీకేజీలకూ ఫైన్..
నవంబర్ 1 నుంచి అమలు

దశ, హైదరాబాద్: నీటి కొరత నేపథ్యంలో తాగునీటిని వృథా చేస్తే రూ.5 వేల జరిమానా విధించాలని జలమండలి నిర్ణయించింది. నీటి రవాణా సమయంలో లీకేజీలకు కారణమయ్యే ట్యాంకర్ల యజమానులకూ ఈ నిబంధన వర్తించనుంది. తొలిసారి జరిమానా విధించినా మళ్లీ లీకేజీ జరిగితే ట్యాంకర్

..మిగతా 4వ పేజీలో ➔

హైదరాబాద్‌లో పెరుగుతున్న చలి..

మొదటి పేజీ తరువాయి

చోటుచేసుకోవడంతో నగరవాసులు చలిని అనుభవిస్తున్నారు. మరోవైపు, బంగాళాఖాతంలో ఏర్పడే వాతావరణ వ్యవస్థల ప్రభావంతో తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్న అంచనాలు ఆసక్తి రేపుతున్నాయి.గరంలో సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో ఉదయం వేళల్లో బయటకు వెళ్లేవారు చల్లని వాతావరణాన్ని ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట చల్లని గాలులు వీస్తుండటంతో వృద్ధులు, చిన్నపిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నగరంలోని ప్రాంతాలను బట్టి ఉష్ణోగ్రతల్లో మార్పులు ఉండే అవకాశం ఉంది. భారత వాతావరణ శాఖ



అంచనాల ప్రకారం అక్టోబర్ 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సుమారు 19 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండవచ్చని నివేదికలు పేర్కొన్నాయి. అక్టోబర్ 28, 29 తేదీల్లో నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అంచనా వేస్తున్నారు. అయితే వర్షాల తీవ్రత, అవి కురిసే ప్రాంతాలు స్థానిక వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. మరోవైపు, రాష్ట్రంలో అక్టోబర్ 1 నుంచి 21 వరకు సాధారణంగా 75.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, కేవలం 3.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైనట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ వర్షపాతం లోటు వ్యవసాయంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. నేలలో తేమ, రబీ సాగు ప్రణాళికలపై రైతులు ఆందోళన చెందుతున్నారు. రానున్న రోజుల్లో కురిసే వర్షాలు వ్యవసాయానికి ఎంతవరకు ఉపయోగపడతాయన్నది కీలకంగా మారింది. ప్రజలు వాతావరణ శాఖ తాజా సూచనలను గమనిస్తూ, వర్ష సూచన ఉన్న రోజుల్లో ప్రయాణాల సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

విరుచుకుపడనున్న 'ఆర్నబ్' తుఫాన్

రేపు ఉదయం యానాం వద్ద తీరం దాటే అవకాశం.. ఆ పరిసరాల్లో ముందుకు రానున్న సముద్రం


నేడు, రేపు కుంభవృష్టి, అతి భారీ వర్షాలు

గంటకు 115 నుంచి 140 కి.మీ. వేగంతో గాలులు

వ్యవసాయ, ఉద్యాన పంటలపై ప్రభావం

కాకినాడ, గంగవరంలో మూడో నంబరు హెచ్చరిక

పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు



దేశ తూర్పుతీరంలో ఈ ఏడాది తొలి తుఫాన్ సోమవారం బంగాళాఖాతంలో ఏర్పడింది. ఈ తుఫాన్‌కు బంగ్లాదేశ్ ప్రభుత్వం సూచించిన పేరు(ఆర్నబ్) పెట్టారు. గతేడాది డిసెంబరులో తమిళనాడులో 'దిత్వా' తుఫాన్ తీరం దాటింది. ఆ తర్వాత సుమారు పది నెలలకు ఆర్నబ్ వచ్చింది. హిందూ మహాసముద్రం నుంచి తేమ మేఘాలు బంగాళాఖాతం వైపు రావడంతో అక్కడ ఉపరితల ఉష్ణోగ్రతలు 29 నుంచి 30 డిగ్రీలు వరకు నమోదవుతున్నాయి. దక్షిణ తమిళనాడుకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం నుంచి అవసరమైన తేమగాలులు తుఫాన్ దిశగా వస్తున్నాయి. వీటన్నింటితో ఆర్నబ్ తుఫాన్ బలంగా మారుతోందని, ఉత్తర కోస్తాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడనున్నదని వాతావరణ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ కోస్తాంధ్రకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. తూర్పు మధ్య, దానికి ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర వాయుగుండం ఆదివారం రాత్రి వరకు నైరుతి దిశలో పయనించిన అనంతరం పశ్చిమ వాయవ్యంగా దిశ మార్చుకుంది. సోమవారం ఉదయానికి తూర్పు మధ్య బంగాళాఖాతం మీదుగా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి తుఫాన్‌గా బలపడింది. సోమవారం రాత్రికి ఇది తీవ్ర తుఫాన్‌గా మారింది. ఇది గంటకు 13 కి.మీ. వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నానికి తూర్పు ఆగ్నేయంగా 430 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి మంగళవారం ఉదయానికి అతి తీవ్ర తుఫాన్‌గా బలపడనుంది. బుధవారం తెల్లవారుజాము నాటికి ఉత్తర కోస్తాకు అతి సమీపంగా వచ్చి అదేరోజు ఉదయం విశాఖపట్నం, మచిలీపట్నం మధ్య యానాం వద్ద తీరం దాటనున్నదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. అతితీవ్ర తుఫాన్ తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, అప్పుడప్పుడు 140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని హెచ్చరించింది. కాగా, మంగవారం మధ్యాహ్నం తర్వాత అత్యంత తీవ్ర తుఫాన్‌గా మారుతుందని ఇస్రో వాతావరణ నిపుణుడు హెచ్చరించారు. మీటరున్నర ఎత్తుకు ఎగసిపడనున్న అలలు మంగళవారం రాత్రి నుంచి కాకినాడ, యానాం, కోనసీమ ప్రాంతాల్లో సముద్ర అలలు మీటరు నుంచి మీటరున్నర ఎత్తు వరకు ఎగసిపడతాయని, దీంతో సముద్రం ముందుకు వస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, అల్లూరి జిల్లాలపై పెనుగాలులు, కుంభవృష్టి వర్షాల తీవ్ర ప్రభావం ఉంటుందని, ముఖ్యంగా కాకినాడ, కోనసీమ జిల్లాలు అత్యంత ప్రభావానికి గురవుతాయని వాతావరణ నిపుణుడొకరు పేర్కొన్నారు. మంగళ, బుధవారాల్లో దూరప్రయాణాలు వాయిదా వేసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. తీర ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ సూచించారు. సంద్రంలోని హోప్ ఐలాండ్‌లో నివాసముంటున్న 130మంది మత్స్యకారులను కాకినాడ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం తూరంగిలోని తుఫాను షెల్టర్‌లోకి తరలించారు.

స్కూళ్లకు సెలవులు..

తుఫాను నేపథ్యంలో ఉభయగోదావరి, విశాఖ, కాకినాడ, కోనసీమ, కృష్ణా, విజయనగరం, ఎన్టీఆర్, బాపట్ల, ఏలూరు, శ్రీకాకుళం జిల్లాల్లో పాఠశాలలకు మంగళ, బుధవారాలు సెలవులు ప్రకటించారు. అనకాపల్లి జిల్లాలో మాత్రం గురువారం కూడా సెలవు ఇచ్చారు.

బీచ్‌లు తాత్కాలికంగా మూసివేత

బాపట్ల జిల్లా పరిధిలోని సూర్యలంక, రామాపురం, ఓడరేవు బీచ్‌లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. మంగళవారం నుంచి తదుపరి ఆదేశాలు వెలువడే వరకు సముద్రతీర ప్రాంతాలకు సందర్శకులకు అనుమతి లేదన్నారు.

నేడు, రేపు అతిభారీ వర్షాలు

కోస్తాంధ్రలో పలుచోట్ల సోమవారం వర్షాలు కురిశాయి. మంగళవారం అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు జిల్లాల్లో కుంభవృష్టి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అల్లూరి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అతిభారీగా, కోస్తాంధ్రలోని మిగిలిన జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయి. బుధవారం విశాఖ, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, ఉభయ గోదావరి, కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కుంభవృష్టి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, బాపట్ల జిల్లాల్లో అతిభారీగా, కోస్తాంధ్రలోని మిగిలిన జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. 29వ తేదీ వరకు సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, కోస్తాంధ్రలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. కాకినాడ, గంగవరం ఓడరేవుల్లో మూడో నంబరు, విశాఖ, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం రేవుల్లో రెండో నంబరు ప్రమాద సూచిక జారీచేశారు.

జ్ఞానేశ్‌ను తొలగించమని మోదీకి చెప్పండి!

ఢిల్లీ వ్యాపారులకు రాహుల్ సూచన


అర నిమిషంలోనే నిరసనలు నిలుస్తాయని వ్యాఖ్య

న్యూఢిల్లీ: 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండీ బ్లాక్ నవంబరు 1న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో భారీ నిరసనకు సిద్ధమవుతోంది. అయితే, దీపావళి, ధన్‌తేరస్ వంటి పండుగల నేపథ్యంలో ఈ నిరసన కారణంగా తమ వ్యాపారాలు దెబ్బతింటాయని పేర్కొంటూ వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దాదాపు రూ.25 వేల కోట్ల మేరకు వ్యాపారాలు ప్రభావితం అవుతాయని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఇండీ నిరసనను వాయిదా వేయాలని కోరుతున్నాయి. ఈ విజ్ఞప్తిపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ఓట్ చోరీ 4వ నిందితుడు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని మోదీకి చెప్పండి. అర నిమిషంలోనే నిరసనలు ఆగిపోతాయి" అని పేర్కొన్నారు. "ఢిల్లీలోని ప్రతి వ్యాపారి పట్ల మాకు ప్రేమ ఉంది. మీ మాట వింటాం. ప్రభుత్వం మెట్రోను మూసేసింది. రహదారులను దిగ్బంధించింది. మన రాజధానిని లాక్ డౌన్ చేసింది. ఓట్ల దొంగతనం అనేది ఎవరికీ క్షేమం కాదు. మీ దుకాణాలు, మీ పొదుపు, మీ చిన్నారుల భవిష్యత్తుకు కూడా గొడ్డలి పెట్టు. అందుకే.. జ్ఞానేశ్‌ను ఆ పదవి నుంచి తప్పించాలని మోదీని కోరండి" అని రాహుల్ అన్నారు.

వడ్లకు రికార్డు ధర.. క్వింటాల్ రూ.5,016!

మొదటి పేజీ తరువాయి

మార్కెట్‌లో పోటీ పెరిగినట్లు చెబుతున్నారు. కొందరు వ్యాపారులు ముందుగానే రైతులకు అడ్వాన్సులు ఇచ్చి పంట కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాలతో బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం ఏగ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461 కనీస మద్దతు ధర ప్రకటించింది. ఎంపిక చేసిన సన్న రకాల ధాన్యానికి రూ.500 బోనస్ కలిపితే రైతుకు రూ.2,961 వరకు లభిస్తుంది. అయితే బహిరంగ మార్కెట్‌లో అంతకంటే అధిక ధర వస్తుండటంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాల కోసం సన్న ధాన్యాన్ని సేకరించాలనుకుంటున్న ప్రభుత్వానికి సవాలు ఎదురవుతోంది. ధాన్యం ధరల పెరుగుదల ప్రభావం బియ్యం మార్కెట్‌పైనా కనిపిస్తోంది. సన్న బియ్యం కిలో ధర రూ.90 నుంచి రూ.100 వరకు చేరినట్లు సమాచారం. దీంతో ఒకవైపు రైతులకు మెరుగైన ధర లభిస్తుండగా, మరోవైపు సామాన్య వినియోగదారులపై భారం పెరుగుతోంది. సన్న రకం వరి సాగును ప్రోత్సహించినప్పుడు విమర్శలు ఎదురైనా, ప్రస్తుతం దాని ప్రయోజనాలు రైతులకు అందుతున్నాయని



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు వార్తలు వెలువడ్డాయి. రానున్న నవంబర్, డిసెంబర్ నెలల్లో వరి కోతలు ముమ్మరమయ్యే నేపథ్యంలో మార్కెట్‌కు ధాన్యం రాక పెరగనుంది. దీంతో ప్రస్తుత ధరలు కొనసాగుతాయా? లేక తగ్గుతాయా? అన్నది రైతుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రికార్డు ధరలు రైతులకు లాభాలు అందిస్తున్నప్పటికీ, బియ్యం ధరల పెరుగుదల సామాన్య కుటుంబాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది కీలకంగా మారింది.



నీటి ఎద్దడి.. బాసర ట్రిపుల్ ఐటీలో ఆన్‌లైన్ క్లాసులు

మొదటి పేజీ తరువాయి

ఈ1 నుంచి ఈ4 వరకు విద్యార్థులు నవంబర్ 18న క్యాంపస్‌లో రిపోర్టు చేయాలని యాజమాన్యం ఆదేశించింది. మిడ్‌టర్మ్ పరీక్షలను నవంబర్ 19 నుంచి 21 వరకు యథావిధిగా నిర్వహించనున్నారు. క్యాంపస్‌లో సుమారు 9 వేల మంది విద్యార్థులకు రోజుకు 20 లక్షల లీటర్లకు పైగా నీరు అవసరమవుతోంది. పంపుల సమస్యతోపాటు నిల్వ నీరు తగ్గడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. నీటి సమస్య కారణంగా విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు యాజమాన్యం వెల్లడించింది.

మహాలక్ష్మి పథకంతో 10వేల కోట్లకు పైగా ఆదా

మొదటి పేజీ తరువాయి

గుర్తుచేస్తోంది. పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడంపై టీజీఎస్ఆర్టీసీ దృష్టి సారిస్తోంది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు బస్సుల నిర్వహణ, సమయపాలన, రద్దీ నియంత్రణపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

నీళ్లు లేక.. కరెంట్ రాక..

మొదటి పేజీ తరువాయి

తీవ్ర ఆవేదనకు గురైన సదరు రైతు పంటకు నిప్పంటించాడు. కౌలు ఎట్లా కట్టాలి, పెట్టుబడి ఎట్లా ఎల్లాలి, కుటుంబం ఎట్లా గడవాలి అని బాధిత కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి పంటలకు సరిపడా నీళ్లు, కరెంట్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

నీరు వృథా చేస్తే రూ.5 వేల జరిమానా

మొదటి పేజీ తరువాయి

రిజిస్ట్రేషన్ రద్దు చేసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నిబంధనలు నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నట్లు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ప్రకటించారు. మరోవైపు, నీటి వృథాపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కూడా రూ.5 వేల జరిమానా విధించనున్నట్లు తెలిపింది. నగరంలో అక్టోబర్‌లోనే రోజుకు సుమారు 7 వేల వాటర్ ట్యాంకర్ల బుకింగ్స్ జరుగుతున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.

స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్ల జోరు..

మొదటి పేజీ తరువాయి

100 సూచీ 1.38 శాతం లాభపడింది. ఉదయం బలహీనంగా ఉన్న ఈ షేర్లు చివర్లో కోలుకోవడంతో మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడింది.నిఫ్టీలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బీఎస్ఈ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. మరోవైపు శ్రీరామ్ ఫైనాన్స్, టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ నష్టపోయిన షేర్ల జాబితాలో ఉన్నాయి.నిఫ్టీ 22,600 పైన నిలదొక్కుకుంటే 22,800-22,900 స్థాయిల దిశగా కదిలే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషించారు. అయితే, 22,800 పైన నిలకడగా ముగిస్తేనే మార్కెట్ ఊపునకు మరింత బలం చేకూరుతుందని తెలిపారు. మరోవైపు ఇండియా వీఐఎక్స్ 17.12 వద్ద ఉండటం మార్కెట్లో ఒడిదొడుకులు కొనసాగే అవకాశాలున్నాయని సూచిస్తోంది. అందువల్ల సూచీలు లాభాల్లో ముగిసినా, తదుపరి ట్రేడింగ్‌లోనూ అప్రమత్తత అవసరమని నిపుణులు భావిస్తున్నారు.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఫడ్నవీస్‌కు ఆహ్వానం

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో సదస్సు

దశ, హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు హాజరుకావాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీకి సంబంధించి జరిగిన సమావేశం అనంతరం రేవంత్‌రెడ్డి, ఫడ్నవీస్‌తో గ్లోబల్ సమ్మిట్ వివరాలను పంచుకున్నారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యాలతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు. దీనిపై ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని, హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. తెలంగాణను దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సును నిర్వహిస్తోంది.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com